క్లుప్తంగా

50 శాతం రాయితీపై బిందుసేద్యం పరికరాలు



బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

సంతకవిటి: రైతులకు 50 శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందిస్తున్నట్లు ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలోని రైతు తవ్వ గోపాలరావుకు అందజేసిన బిందుసేద్యం పరికరాలు, వాటి పనితీరును ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఈ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శునకాలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్



రాజాం పట్టణంలో వీధి కుక్కలను తరలిస్తున్న స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రోడ్లపై సంచరిస్తున్న శునకాలను పట్టుకుని, యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. పలుచోట్ల కుక్కలను సిబ్బంది శుక్రవారం పట్టుకుని, ఆపరేషన్లకు తరలించారన్నారు. మూడు రోజుల తర్వాత వాటిని విడిచిపెడతామన్నారు. ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున ఆపరేషన్ నిమిత్తం హరియానాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి చెల్లించడం జరిగిందన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు



సంతకవిటి: వాసుదేవపట్నం వద్ద కాలువలోని గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం నుంచి ప్రారంభమైన నారాయణపురం కుడికాలువలో పెరిగిన రెల్లిగడ్డి, గుర్రపుడెక్కను శుక్రవారం తొలగించారు. కాలువలోని వీటిని తీసివేయడం ద్వారా సాగునీటి సరఫరాకు సాఫీగా జరుగుతుందని రైతులు అంటున్నారు. అయితే తొలగించిన గుర్రపుడెక్క, రెల్లిగడ్డిని కాలువకు దూరంగా పడవేయాలని, లేకపోతే వరదల సమయంలో అవే మళ్లీ కాలువలోకి చేరిపోయి సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారం అందివ్వాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి

బొబ్బిలి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలని ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆమె.. మెనూ ప్రకారం కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం వండిపెట్టాలని తెలిపారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.ప్రభావతి, బి.శుభలక్ష్మి, ఎస్.కృష్ణవేణి, బి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలపై ఎంఈవో సంతృప్తి



రికార్డులు పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈవో

వంగర: మండలంలోని లక్ష్మీపేట గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యాప్రమాణాలపై ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. అక్కడి రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించగా అన్నీ బాగుండడంతో ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రియదర్శిని, ఉపాధ్యాయుడు బి.బాలమోహన్‌ను అభినందించారు. విద్యార్థులు చదవడం, రాయడంలో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చూడామణి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకే సామాజిక తనిఖీలు

- సోషల్ ఆడిట్ ప్రజావేదికలో ఏపీడీ శారదాదేవి, విజిలెన్స్ అధికారి వెంకటరమణ



సోషల్ ఆడిట్ ప్రజావేదికలో సమస్యలు వివరిస్తున్న ఈసీ, టీఏలు

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరగకుండా పారదర్శకంగా నిర్వహించేందుకే సామాజిక తనిఖీలు చేపడుతున్నామని ఉపాధి హామీ పథకం ఏపీడీ శారదాదేవి, విజిలెన్స్ అధికారి వెంకటరమణలు అన్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.16.96 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన చెరువులు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల పనులు, సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి, ఎస్‌ఆర్‌పీలు ఎస్.మన్మథరావు ఆధ్వర్యంలో గత పది రోజులుగా డీఆర్‌పీలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్య ఆ సామాజిక తనిఖీలకు సంబంధించి, ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఒక్కో పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల నివేదికలను ఆయా డీఆర్‌పీలు చదివి వినిపించారు.

జాబ్‌కార్డులకు డబ్బులు డిమాండ్..

కొన్ని గ్రామాల్లో పనికి హాజరుకాని వేతనదారులకు పేమెంట్లు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. పాతరేగలో జాబ్‌కార్డులు ఇవ్వడానికి ఎఫ్‌ఏ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అలాగే 104 మంది వేతనదారుల వద్ద వారానికి రూ.1500 చొప్పున వేతనాలు పడేలా చేస్తానని చెప్పి, ఒక్కొక్కరి దగ్గరి నుంచి రూ.100 చొప్పున వసూలు చేశారని డీఆర్‌పీలకు వేతనదారులు ఫిర్యాదు చేసినట్లు సంబంధిత డీఆర్‌పీ వెల్లడించారు. కొంతమందితో పని చేయించి, వేతనాలు వేయలేదని పలువురు తెలిపారన్నారు. దాదాపు అన్ని పంచాయతీల్లో ఒకరికి బదులు వేరొకరు పనులకు వెళ్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ జనార్దనరావు, ఏపీవోలు త్రినాధరావు హరనాథ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



తహసీల్దార్ రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

తెర్లాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మిని సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించడంలో తహసీల్దార్ సేవలు ప్రశంసనీయమని, ఎన్నికల విధుల్లో ఆమె కనబరిచిన చిత్తశుద్ధి, నిబద్ధత ఆదర్శనీయమన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ జి.భాస్కరరావు, మండల వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు ఎస్.నరసింహనాయుడు, ఆర్‌ఐ అప్పలరాజు, మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



ర్యాలీలో మాజీ సైనికులు, విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై మనదేశం సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఇదేరోజున కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుని, ఆ యుద్ధంలో అమరులైన జవానులకు నివాళులర్పించడం గమనార్హం. మాజీ సైనికులు, వాసు కళాశాల విద్యార్థులు చేపట్టిన ఈ ర్యాలీలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.అప్పారావు, అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని, అమర జవాన్ల పోరాట స్ఫూర్తి కొనియాడుతూ నివాళులర్పించారు.

నేడు కౌన్సెలింగ్

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సీట్ల భర్తీకి శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఉదయం 8 గంటలకే అన్ని ధ్రువపత్రాలు, ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్సులతో హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్న మహిళలు

బొబ్బిలి: తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక పట్టణంలోని అమ్మిగారి కోనేరు గట్టు వాసులు కోరుతున్నారు. ఇక్కడి తాగునీటి కుళాయి నుంచి గత నాలుగైదు రోజులుగా సన్నని ధారలా నీరు వస్తోందని, వచ్చిన ఆ నీరు కూడా కుళ్లిన వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని లేకపోతే వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు.

బఫర్‌జోన్‌లో ఆగని అక్రమ నిర్మాణాలు

బొబ్బిలి: పట్టణంలోని ఏఎంసీ సమీపంలోని భైరిసాగరం వద్ద లేఅవుట్‌లో బఫర్‌జోన్‌గా కొంతభూమిని అలానే ఉంచారు. ప్రస్తుతం ఆ జోన్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదే విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోని దుస్థితి. ఆ తర్వాత కొన్నాళ్లకు అక్కడి అక్రమ నిర్మాణాలను నిలిపివేయించాలని మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అయినా నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

రాజాం సిటీ: డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ద్వారా పరీక్షలు రాసేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్న హైందవి శుక్రవారం తెలిపారు. 2011 నుంచి 2015 మధ్యలో డిగ్రీ చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో తప్పిపోయిన సబ్జెక్టులను రాసుకునేందుకు అంబేడ్కర్ యూనివర్సిటీ అవకాశం కల్పించిందన్నారు. ఆగస్టు 14వ తేదీ వరకు పరీక్ష ఫీజు ఆయా కళాశాలల్లో చెల్లించాలని, థియరీ పరీక్షలతో పాటు ప్రాక్టికల్స్ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 20వ తేదీ నుంచి హాల్ టికెట్లు ఆయా కళాశాలల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రాక్టికల్స్ కూడా ఆగస్టు 22 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. థియరీ పరీక్షలు సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘సూపర్ సిక్స్’ అమలెప్పుడు..?



కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాసరావు

బొబ్బిలి: సూపర్ సిక్స్ పేరిట ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. తప్పనిసరిగా ఇవ్వాల్సిన పింఛన్ పెంపు మాత్రమే ప్రభుత్వం పెంచి ఇస్తోందని, మిగతా అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను ఎప్పుడు అమలు చేస్తారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే ప్రజలు తిరగబడడం ఖాయమని హెచ్చరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బొబ్బిలి: మురుగుకాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి



రేగిడి: అప్పాపురంలో కాలువల్లోని పూడికలు తీస్తున్న సిబ్బంది

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని యాత, గొల్ల వీధులతో పాటు బంగారమ్మ కాలనీ, మహారాణిపేట, అప్పయ్యపేట తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం పర్యటించారు. ఇంటి పరిసరాలు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్థానికులకు సూచించారు. అనంతరం అప్పయ్యపేటలోని సాగునీటి కాలువల లీకులను తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పరిశీలింపజేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీడీవో శ్యామలాకుమారి పరిశీలించారు. మురుగుకాలువల్లోని చెత్తాచెదారం తొలగించి, కాలువలు, రోడ్ల పక్కన బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

- సూడోమోనాస్ ద్రావణంతో వరినారును శుద్ధి చేసుకోవాలి
- నాటేముందు నారు చివర్లు తొలగించాలి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



రామభద్రపురం: వరినారు నాటే ముందు చిగుర్లు తొలగించుకోవాలని చెబుతున్న ఏవో వెంకటయ్య



రేగిడి: వరినారు చివర్లు తొలగించి నాటుకోవాలని అవగాహన కల్పిస్తున్న వీఏఏ మహేష్



తెర్లాం: సూడోమోనాస్ ద్రావణంతో వరినారు శుద్ధి చేసుకోవాలని చెబుతున్న ఏవో సునీల్‌కుమార్

తెర్లాం: వరినాట్లు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏవో జి.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని కుసుమూరు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి పొలాల్లో వరినాట్లు వేయడాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు వేసే ముందు జీవశిలీంధ్రనాశిని అయిన సూడోమోనాస్ ద్రావణంతో వరినారును శుద్ధి చేసుకోవాలని తెలిపారు. అలాగే నారు చివర్లు కూడా తొలగించి, నాటుకోవాలన్నారు. నాట్లు వేయడం పూర్తయిన తర్వాత ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటను ఆశించే తెగుళ్ల నివారణకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని, సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించాలని కోరారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఆయన వెంట వీఏఏ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రేగిడి: వరినారు చివర్లు తొలగించి, నాటుకుంటే పంటను ఆశించే పురుగులు పట్టవని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ అన్నారు. మండలంలోని ఉంగరాడ గ్రామ పొలాల్లో వరినారు శుద్ధిచేసుకోవడం, నాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో వరినారును శుద్ధి చేసుకుని, నాటుకోవడం ద్వారా నారువేరులో ఉండే ఫంగస్ నాశనమై, పంట బాగా పండుతుందన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు..

రామభద్రపురం: వరి సాగులో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో వెంకటయ్య తెలిపారు. మండలంలోని గొల్లలపేట గ్రామంలో చేపడుతున్న వరి ఉబాలను ఆయన శుక్రవారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వరినాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి, మురుగు నంతవరకు ఉంచి ఆ తర్వాత మళ్లీ దమ్ము చేసుకోవాలన్నారు. మడిలోని నీరు అవలీలగా తిరిగేలా చెక్కతో చదును చేసుకుని, వరినాట్లు నాటేముందు నారుకట్టల చివర్లు తుంచి, నాటితే పురుగుగుడ్లు నశిస్తాయని తెలిపారు. అలాగే వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలు ఉంచుకోవాలని, తద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఏపుగా పెరుగుతుందన్నారు. వరినాట్లు వేసే ముందు నారుకట్టలను సూడోమోనాస్ ద్రావణంలో శుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమయానికి విధులకు హాజరుకావాలి



బొబ్బిలి రూరల్: సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



రాజాం సిటీ: సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బొబ్బిలి రూరల్: సమయానికి విధులకు హాజరుకావాలని ఎంపీడీవో రవికుమార్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని అలజంగి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనివేళల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై గ్రామస్తులను అప్రమత్తం చేయాలని, సీజనల్ వ్యాధుల బారినపడకుండా చైతన్యం చేయాలన్నారు. ఏ ఒక్క ఉద్యోగిపై అయినా అవినీతి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు.

రాజాం సిటీ: సమయపాలన పాటించాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది మ్యాపింగ్‌పై శుక్రవారం సమీక్షించారు. ప్రజలకు సకాలంలో సేవలందించాలని, ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీకి సిద్ధం కావాలని, ఆరోజే శతశాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

పక్కాగా డ్రైడే



బొబ్బిలి రూరల్: రోటిలోని నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్త

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం పక్కాగా నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి, ఇంటి పరిసరాల్లోని అనవసర నీటి నిల్వలు, కాలువల్లోని మురుగును తొలగించేలా చర్యలు చేపట్టారు. అనంతరం అపరిశుభ్రత, మురుగునీటి నిల్వల ద్వారా తలెత్తే సమస్యలను వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. తమరాం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైద్యుడు యు.యోగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి, ఎం.బూర్జవలస, అలజంగి గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రత, వర్షాకాలంలో తలెత్తే సీజనల్ వ్యాధులు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడ నీటి నిల్వలు ఉంటాయో అక్కడ దోమలు పెరిగి తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

వంగర: మండలంలోని శివ్వాం, రుషింగి గ్రామాల సమీపంలో ఎస్‌ఐ వై.వి.జనార్దన్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని, అలా అయితే ప్రమాదాలు నివారించవచ్చని ఆయన సూచించారు. అనంతరం పలు జంక్షన్ల వద్ద జంగిల్స్‌ను తొలగించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాజాం తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఎన్నికల అధికారి పి.భూషణరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు, కార్యదర్శిగా పి.గంగారాం, సహాధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.పాపినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.కిశోర్‌లు ఎంపిక కాగా ఉపాధ్యక్షులుగా డి.భీమశంకర్, వి.విద్యాసాగర్, ఎ.వి.సత్యనారాయణ, పి.వి.నారాయణమ్మ, సంయుక్త కార్యదర్శులుగా పి.చిరంజీవి, కె.సురేష్, యు.అప్పారావు, జె.రాము, వై.మణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల పర్యవేక్షకులు పి.మేరి తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేయడంపై అవగాహన



డ్రమ్‌సీడర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామ పొలాల్లోని రైతులకు డ్రమ్‌సీడర్ యంత్రం ద్వారా వరినాట్లు వేయడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏవో మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్‌లు గులివిందల సూర్యానారాయణ అనే రైతుకు చెందిన ఆరు ఎకరాల పంట పొలంలో డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా వరినాట్లు వేసి, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ యంత్రం ద్వారా వరినాట్లు వేసుకోవడం వల్ల మొక్కకు మొక్కకూ మధ్య సరైన ఖాళీ ఉంటుందని, దీంతో పంట ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ రేఖ, యూనిట్ ఇన్‌చార్జ్ పార్వతమ్మ, రెడ్డీస్ ఫౌండర్ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



తెర్లాం: ఆమిటి సచివాలయంలో ఆధార్ సేవల కోసం వేచిఉన్న గ్రామస్తులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ ద్వారా అందజేస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు కోరారు. మండలంలోని ఆమిటి గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆధార్‌కార్డు కొత్తగా చేయించుకోవాలన్నా, పాతకార్డులోని పేర్లు, అడ్రస్‌లలో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కవిరాయునివలస పంచాయతీ కార్యదర్శి వి.హరి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గురవాం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం వస్తున్న ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



రేగిడి: ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



తెర్లాం హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రేగిడి: కిశోరి బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలు ఎదుర్కొంటున్న రుతుచక్ర సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేగిడి, బూరాడ, ఉనుకూరు, సంకిలి సెక్టార్ల సూపర్‌వైజర్లు నూకాలమ్మ, శశికళ, అమ్మన్నమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు.

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త శ్రీదేవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణిలు బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, యుక్త వయసులో బాలికలు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.